సాక్షి
నారాయణపేట
ఆదివారం । 4 । జూన్ । 2023



'చిన్నోనిపల్లి' పనుల అడ్డగింత

చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను నిర్వాసిత రైతులు మరోమారు అడ్డుకున్నారు.

వివరాలు 10లో ▸



కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

పీయూలో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని నిరసన చేపట్టారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.8 /26.1

రోజంతా ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాలు

ధన్వాడ: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొండాపూర్ గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన రెగ్యులర్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రూ.100 చెల్లించి దరఖాస్తులను గురుకుల వెబ్‌సైట్ www.tgtwgurukulam.telangana.gov.inలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని, దరఖాస్తుల సమర్పణ చివరి తేదీ ఈనెల 15వరకు ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు సైకిల్ పోటీలు



మక్తల్: సైకిల్ దినోత్సవం సందర్భంగా మక్తల్ యల్లమ్మకుంటలో విద్యార్థులకు శనివారం విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో సైకిల్ పోటీలు నిర్వహించారు. జిల్లా సైకిల్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీల్లో 14 నుంచి 17 సంవత్సరాలలోపు బాలబాలికలు దాదాపు వందమంది పాల్గొన్నారు. ఈనెలాఖరులో వరంగల్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పీఈటీలు అంబ్రేస్, రమేష్, జగదీష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీలత, విశాలి పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఉద్యోగులకు క్రీడాపోటీలు

నారాయణపేట రూరల్: పోలీసు శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు సురక్ష దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో శనివారం క్రీడాపోటీలను అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృడత్వాన్ని ఇస్తాయన్నారు. స్నేహభావం పెంపొందించుకోవడానికి తోడ్పడతాయన్నారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, సీఐ రవిబాబు, రామ్‌లాల్, పీఈటీలు గోపాలం, సాయినాథ్, అంబారీష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు 'పరీక్షే'



మక్తల్‌లో టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

- గైడెన్స్ లేక అయోమయంలో టెన్త్ ఫెయిల్ విద్యార్థులు
- పాఠశాలల్లో కానరాని ప్రత్యేక తరగతులు
- ఎక్కువ మంది గణితంలోనే ఫెయిల్

మండలం	పరీక్ష రాసిన విద్యార్థులు	ఫెయిల్
నారాయణపేట	1,367	145
మక్తల్	1267	344
మద్దూర్	904	407
కోస్గి	867	328
ధన్వాడ	631	235
దామరగిద్ద	564	36
ఊట్కూర్	543	101
మరికల్	514	99
నర్వ	338	70
కృష్ణా	283	27
మాగనూర్	262	87

నారాయణపేట రూరల్: సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వారు అయోమయంలో ఉన్నారు. మరో 10రోజుల్లో పరీక్షలు ప్రారంభంకానున్నాయి. కరోనా వైరస్ ఎఫెక్ట్ సమయంలో పాఠశాలలు మూతబడటం, ఆన్‌లైన్ తరగతులు సరిగా అర్థంకాక, సెల్‌ఫోన్‌కు అలవాటు పడిన చాలామంది విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కొరవడ్డాయి. దీంతోపాటు టెన్త్ పరీక్షలను 11 నుంచి 6కి కుదించడం, ఒక్క సబ్జెక్టుకు ఒకే పరీక్ష, ప్రశ్నాపత్రాలు కఠినంగా ఉండటం వల్ల అనుత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 7,541 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో 3,537 మంది బాలురు, 4,004 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 985 బాలురు, 895 మంది బాలికలు మొత్తం 1,880 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. అయితే ప్రైవేటు స్కూళ్లలో 1,293మంది హాజరుకాగా 119మందితో కేవలం 10శాతం పరీక్షలు తప్పినవారు ఉన్నారు. అత్యధికంగా ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో 40శాతం మేర ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 494 మందికి 157మందితో 32శాతం, జెడ్పీ స్కూల్‌లో 4,166 మందికి 2,782 మందితో 35శాతం మంది ఫెయిల్ అయ్యారు. అదేవిధంగా జిల్లాలోని రెండు మోడల్ స్కూల్స్, 11కేజీబీవీల్లో సైతం 30శాతం మేర ఫెయిల్ అయ్యారు. రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో 20శాతంలోపు పరీక్షలు తప్పినవారు ఉన్నారు.

గణితమే కొంపముంచింది..

జిల్లా వ్యాప్తంగా నాలుగు మాధ్యమాల్లో విద్యాబోధన జరుగుతోంది. అత్యధికంగా తెలుగు మీడియంలో ఫెయిల్ అయ్యారు. 4,112మంది పరీక్ష రాయగా 1,404మంది అనుత్తీర్ణత సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో 3,136 మందికి 414మంది ఫెయిల్ అయ్యారు. ఇక ఉర్దూ మీడియంలో 222మందికి 61మంది పాస్ కాలేకపోయారు. కన్నడ మీడియంలో 71మందిలో ఒక్కరే ఫెయిల్ అయ్యారు. వీరంతా ఎక్కువగా గణితంలోనే తప్పారు. ప్రశ్నాపత్రం చాలా కఠినంగా రావడంతో ఆ స్థాయిని అందుకోలేక పోయినట్లు టీచర్లు చెప్పన్నారు. తెలుగులో 103మంది, హిందీలో ఏడుగురు, ఇంగ్లిష్‌లో 24మంది, గణితంలో 1,660 మంది, సైన్స్‌లో 494 మంది, సోషల్‌లో 115 మంది సప్లిమెంటరీ పరీక్షకు హాజరుకావాల్సి ఉంది.

నిర్వహించాలనే ఆదేశాలు రాలేదు..



జిల్లాలో పది విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో 75శాతం ఉత్తీర్ణత సాధించారు. నాలుగోవంతు చిన్నారులు వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. ముఖ్యంగా గణితంలో ఎక్కువ మందితప్పారు. వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని, ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదు. ఒకటి, రెండుచోట్ల హెచ్‌ఎంలు, టీచర్లు తమ ఇష్టంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు అనధికారికంగా తెలిసింది. ఈనెల 14 నుంచి పరీక్షల నేపథ్యంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తే బాగుంటుంది.

– రాజేంద్రకుమార్, జిల్లా పరీక్షల విభాగం అధికారి

ప్రత్యేక తరగతులు ఏవి..?

ఏడాదికాలం చదువుకున్న వెంటనే పరీక్షలు పెడితే రాయలేక ఫెయిల్ అయిన విద్యార్థులు దాదాపు రెండు నెలల విరామం తర్వాత నేరుగా పరీక్షలకు హాజరుకావాలంటే ఒకింత ఇబ్బందిగానే ఉంటుంది. సరైన గైడెన్స్ లేకపోతే వారు సప్లమెంటరీ పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణత సాధిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండే విద్యార్థులు సొంతంగా చదువుకోవడం చాలా కష్టం. అందులోనూ గణితంపై దృష్టి సారించాలంటే మరింత ఇబ్బందిపడుతున్నారు. కనీసం ఈ పది రోజులైన ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో తర్ఫీదు ఇవ్వాలని కోరుతున్నారు.

అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు

నారాయణపేట రూరల్: జిల్లాలోని ఆరు సోషల్ వెల్ఫేర్ స్కూలు, కళాశాలల్లో బోధన చేయడానికి తాత్కాలిక పద్ధతిన అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 5నుంచి 10వ తరగతి వరకు బోధించేందుకు బీఈడీ, ఇంటర్ బోధనకు పీజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధనకు గణితం, సాంఘిక, భౌతిక, రసాయన, జీవ, వృక్ష, జంతుశాస్త్రం, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఈనెల 6న సర్టిఫికెట్లతో అర్హులైన అభ్యర్థులు నారాయణపేట గురుకుల స్కూల్‌లో హాజరుకావాలని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

నారాయణపేట టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీ హర్ష హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ కార్యాయాలన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు హాజరైన వారి వివరాలు తెలుసుకున్నారు.

సురక్ష దినోత్సవం విజయవంతం చేద్దాం



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సురక్ష దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 7గంటలకు ఎస్పీ కార్యాలయం నుంచి పాతబస్టాండ్, శ్రీసత్యనారాయణచౌరస్తా, అంబేడ్కర్ సర్కిల్, మున్సిపల్ పార్క్ మీదుగా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరేడ్ మైదానంలో విద్యార్థులు, యువత కోసం ఓపెన్ హౌస్ నిర్వహిస్తామన్నారు. పోలీసుల విధులు, ఆయుధాల వినియోగం, వివిధ విభాగాల పనితీరుపై అవగాహన కల్పిస్తామన్నారు. సాయంత్రం 7గంటలకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పోలీసుశాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు, సేవా పథకాలు, క్రీడాపోటీల బహుమతులు అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఆర్‌ఐలు, సీఐలు పాల్గొన్నారు.

స్టాళ్ల పరిశీలన..

శనివారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో స్టాళ్ల ఏర్పాటును పరిశీలించారు. వర్షం కురిస్తే ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ రవిబాబు, ఆర్ఐ విజయ్, కృష్ణయ్య ఉన్నారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలు నాశనం

- బాధల తెలంగాణగా మార్చారు
- బీఆర్ఎస్ నాయకులు పోలీసులు లేకుండా ప్రజల్లో తిరుగుతారా..?
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శ



అచ్చంపేట సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క తదితరులు

అచ్చంపేట/అచ్చంపేట రూరల్: కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశారని, బాధల తెలంగాణగా మార్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం రాత్రి అచ్చంపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభకు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, తమిళనాడు సీఎల్పీ నేత సెల్వా పెర్తుంగై, ప్రజా యుద్ధనౌక గద్దర్, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు పోలీసులు లేకుండా తిరగగలరా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు పోలీసుల పడగ నీడలో బతుకుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పేరుతో స్వాధీనం చేసుకున్న 24 లక్షల ఎకరాల భూమిని తిరిగి పేదలకు పంచుతామన్నారు. భూమి లేని కుటుంబాలకు రూ.12 వేల సహాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండా బీఆర్ఎస్ పాలనతో పసిడి పంటలు పండుతున్నాయని చెప్పుకోవడానికి సిగ్గు ఉండాలన్నారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టు వద్ద ఫొటోలు దిగి మేము చేశామని చెప్పుకొంటున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో రాజ్యహింస పెరిగిందన్నారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న పోలీసులు ప్రజల కోసం పనిచేయాలి తప్ప పాలకుల కోసం కాదన్నారు. పదేళ్లుగా భ్రమ కల్పించిన దొర ఇక నీ పాలన చాలని సీఎం కేసీఆర్ గద్దె దింపడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించలేదని, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు.

ప్రపంచంలో మూడు పాదయాత్రలు

ప్రపంచంలో మూడు పాదయాత్రలు ఆదరణ పొందాయని, అంతటి ఆదరణ పొందినది రాహుల్‌గాంధీ పాదయాత్ర అని తమిళనాడు సీఎల్పీ నేత సెల్వా పెర్తుంగై అన్నారు. అదే తరహాలో మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తెలంగాణ ప్రజలు గర్వ పడేలా పాదయాత్ర కొనసాగిస్తున్నారు. భారత్ జోడో యాత్రతో కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపొందిందని, భట్టి పాదయాత్రతో తెలంగాణలోనూ తమ పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. దేశంలో, తెలంగాణలో ప్రజలెవరూ సంతోషంగా లేరని విమర్శించారు.

మాజీ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ

కాంగ్రెస్ పార్టీ యుద్ధానికి సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీని బంగాళాఖాతంలో తొక్కుతామని, రాష్ట్రంలో 100 సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గద్దర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారుల కుటుంబాలను, కళాకారులను ప్రభుత్వం పట్టించుకోలేని కేసీఆర్‌ను దించేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోహిత్‌చౌదరి, శివసేనారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, అనురాధ, విజయ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, సంజయ్, బెల్లయ్యనాయక్, అన్వేష్‌రెడ్డి, ప్రసాద్, జగదీష్, లోకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండ

జిల్లాలో ఘనంగా రైతు దినోత్సవం
- పగడిమారి రైతు దినోత్సవ వేడుకల్లో కలెక్టర్, ఎమ్మెల్యే
- రైతువేదిక, పల్లె దవాఖానా, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



పగిడిమారిలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీహర్ష

ఊట్కూర్: ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శనివారం మండలంలోని పగడిమారి క్లస్టర్ పరిధిలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతుల వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవంలో కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతువేదిక భవనం, పల్లె దవాఖానా ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా రైతుల అభ్యున్నతి కోసం చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలు, దానివల్ల కలిగిన లబ్ధిని రైతులకు గుర్తు చేశారు. ఆయిల్‌పాం సాగు కోసం అందిస్తున్న సబ్సిడీని వివరించేందుకు రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా మూడు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయని, త్వరలోనే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఊట్కూర్ మండలానికి సాగునీరు అందిస్తామని తెలిపారు. అంతకుముందు రైతులు చేపట్టిన ఎడ్లబండ్ల ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్ కుమార్‌గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాంమోహన్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, సులోచనమ్మ మురళీధర్ రెడ్డి, ఎడివెళ్లి నర్సప్ప, ఎంపీటీసీ జాఫర్, ప్రత్యేక అధికారి కృష్ణమాచారి, ఏఓ గణేశ్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అబ్దుల్ ఘని తదితరులు పాల్గొన్నారు.

రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం..



కొండాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ధన్వాడ: తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.64వేల కోట్లు రైతులకు అందజేసిందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. డబ్బులు పట్నంలో కాకుండా పల్లెలోని రైతుల జేబుల్లో ఉండేలా, రైతుల కళ్లల్లో ఆనందం ఉండేలా చేస్తున్నామని చెప్పారు. శనివారం మండలంలోని కొండాపూర్‌లో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు వర్షం కురిసినప్పటి నుంచి పంటకోసే వరకు అడుగడుగునా దయనీయ పరిస్థితి ఉండేదని, ఆత్మహత్యలు చేసుకునేవారని అన్నారు. నేడు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వ హయాంలో రైతు దినోత్సవం నిర్వహించుకునే స్థాయికి చేరుకున్నారని అన్నారు. జిల్లాలో 77 రైతువేదికలు ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కు ఒక ఏఈఓను నియమించామని, నిరంతరం రైతులకు అధికారులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. అనంతరం రైతులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు బీమయ్య, వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పద్మిబాయి, వైస్‌ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రకళ, ఏడీ జాన్‌సుధాకర్ ఏఓ ప్రదీప్‌కుమార్, టీఆర్ఎస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు సునిల్‌కుమార్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే కేసీఆర్ లక్ష్యం



మంతన్‌గోడ్‌లో మాట్లాడుతున్న వనజ

మక్తల్: రైతును రాజును చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ వనజ అన్నారు. శనివారం మక్తల్ మండలం మంతన్‌గోడ్, మాద్వార్, గుర్లపల్లి, గడ్డంపల్లి, జక్లేర్, సత్యవార్, పస్పుల, కర్ని, రుద్రసముద్రం, గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. మంతన్‌గోడ్ గ్రామంలో ఆమె మాట్లాడారు. అనంతరం రైతులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. జక్లేర్‌లో ఎద్దులబండిపై ర్యాలీ నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. ఎంపీపీ వనజ, తహసీల్దార్ తిరుపతయ్య, వైస్‌ఎంపీపీ రామేశ్వరమ్మ, మండలం ఏఓ మితిన్‌చక్రవర్తి, ఏఈఓ శివకుమార్, ఏపీఓ గౌరీశంకర్, ఏఈఓ రితిక, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావనీ, ఎంపీటీలు లక్ష్మి, ఇందిర పారిజాత, పద్మమ్మ, తిమ్మప్ప, సర్పంచ్‌లు మహదేవమ్మ, మహేశ్వరమ్మ, లక్ష్మమ్మ, దత్తు, నర్సిములు, మహిపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విజయలక్ష్మి, రమేష్, వినోద్, మల్లేష్,వెంకటప్ప, రమేష్, వెంకటేష్, లక్ష్మి, విజయ్, ఏఈఓలు ఉన్నారు.

ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ

మాగనూర్: మండలంలోని మాగనూర్, అడవిసత్యారం, వడ్వాట్, కొత్తపల్లి, వర్కూర్, నేరడగం రైతువేదికలో రైతుదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారుల మీదుగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఏఈఓలు మాట్లాడారు. రైతుల కోసమే ప్రత్యేకంగా రైతువేదిక నిర్మించడం గొప్ప నిర్ణయమని అన్నారు. జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఇన్‌చార్జ్ ఏఓ సుదర్శన్‌గౌడ్, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, రైతు సమన్వయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



మాగనూర్ మండలం కొత్తపల్లిలో చేపట్టిన ఎడ్లబండ్ల ర్యాలీ

రాష్ట్ర పురోగతి దేశానికే ఆదర్శం



పెదిరిపాడ్‌లో రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి, సాధించిన ప్రగతి దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో శనివారం రైతు దినోత్సవం పేరుతో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే హన్మాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన రైతువేదిక భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. మద్దూర్ మండలంలోని పెదిరిపాడ్‌లో నూతన రైతువేదిక భవనాన్ని ప్రారంభించారు. పల్లెర్ల, రెనివట్ల గ్రామాల్లో రైతుఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతు దినోత్సవ వేడుకలు..

కోస్గి, గుండుమాల్ మండలాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోగారం రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, ఏఓ శరత్ చంద్రా, ఏఈఓలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్థలదాతను సన్మానించిన ఎమ్మెల్యే

రైతువేదిక నిర్మాణం కోసం ఉచితంగా తన సొంత స్థలాన్ని ఇచ్చిన స్థలదాతను శనివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సన్మానించారు. హన్మాన్‌పల్లికి చెందిన అంకిళ్ల రంగారెడ్డి గ్రామ సమీపంలోనే ఉన్న తన వ్యవసాయ పొలంలో 10గుంటల భూమిని అందజేశారు. అక్కడే నిర్మంచిన రైతువేదిక భవనాన్ని శనివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రారంభించారు.

క్లుప్తంగా

భార్య మృతిచెందిన కొన్నిరోజులకే భర్త..


రాములుగౌడ్ (ఫైల్)

రాజాపూర్: భార్య మృతి చెందిన కొన్ని రోజులకే మనోవేదనకు గురైన భర్త గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని ఈద్గాన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ రాములుగౌడ్(65) భార్య శంకరమ్మ గత నెల 12న అకస్మాత్తుగా ఇంట్లోనే మృతిచెందింది. ఈ క్రమంలోనే తీవ్ర మనోవేదనకు గురైన రాములుగౌడ్ శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రాములుగౌడ్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. రాములుగౌడ్ కుమారుడు ఏఎంసీ డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సైతం రాములుగౌడ్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రాజాపూర్ సర్పంచ్ బచ్చిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములుగౌడ్ గతంలో సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించారు. 20 రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు ఇద్దరూ అకస్మాత్తుగా మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బంగారు దుకాణంలో నగదు చోరీ

ధరూరు: మండల కేంద్రంలోని ఓ బంగారం దుకాణంలో నగదు చోరీ జరిగింది. వివరాలిలా.. గ్రామంలోని గవ్వల రాధాకృష్ణ కాంప్లెక్స్‌లో శివాచారి అనే వ్యక్తి కొంతకాలంగా బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దుకాణంలోనే భోజనం చేస్తుండగా.. గుర్తు తెలియని దుండగుడు క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లాడు. శివాచారి భోజనం అనంతరం కౌంటర్‌లో చూడగా డబ్బులు కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

నంచర్లలో..

మహమ్మదాబాద్: ఎవరూ లేని ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన నంచర్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నంచర్లకు చెందిన కుమ్మరి గౌరమ్మ రెండురోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి కుమారుని వద్దకు వెళ్లింది. రాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప పెట్టెకు వేసిన తాళం విరగ్గొట్టి తులం బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు తీసుకెళ్లారు. ఊరి నుంచి ఇంటికి వచ్చిన గౌరమ్మ తాళం విరగ్గొట్టి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చివరకు పెట్టె చూసుకోగా బంగారం, వెండి నగలు లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

జడ్చర్ల: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన జడ్చర్లలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. పట్టణంలోని పంచముఖికాలనీలో నివాసం ఉంటున్న రవికుమార్‌గౌడ్ ఓ శుభకార్యం నిమిత్తం అత్తగారి ఊరైన బూరెడ్డిపల్లికి శుక్రవారం కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 5 తులాల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 809.7 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం నీటిమట్టం 809.7 అడుగులు, 34.1482 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,066 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయంలో 216 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో చక్కటి వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని రామచంద్రాపూర్‌లో బడిబాట ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఇద్దరు చిన్నారులు ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు డీఈఓనే స్వయంగా దరఖాస్తు నింపి వారికి అడ్మిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలలకు కావాల్సిన అన్ని వసతులను ప్రభుత్వం సమకూరుస్తుందని, తద్వారా విద్యార్థులకు నాణ్యత కలిగిన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓలు బాలుయాదవ్, దుంకుడు శ్రీను, పీఎంశ్రీ శ్రీకాంత్, గోవర్ధన్, సర్పంచ్ కుర్వ రాణెమ్మ, హెచ్‌ఎం బాలపీరు పాల్గొన్నారు.

మాతాశిశు కేంద్రంలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆందోళన


వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ బాలవెంకటరమణ


ఆస్పత్రి గేటు వద్ద బాధిత కుటుంబీకులు

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఓ శిశువు మృతిచెందింది. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు ఆందోళన చేపట్టడంతో వైద్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కొల్లాపూర్ మండలంలోని ఎన్మన్‌బెట్లకు చెందిన మరాఠి అనిత కాన్పు కోసం శుక్రవారం ఉదయం ఆస్పత్రికి తీసుకువచ్చారు. శనివారం తెల్లవారుజామున ఆమెకు సాధారణ కాన్పు జరగగా.. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులే కాన్పు చేశారు. అయితే శిశువులో ఎటువంటి చలనం లేకపోవడంతో నర్సులు వెంటనే చిన్నపిల్లల వైద్యునికి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పాపను పరీక్షించగా కడుపులోనే మృతిచెంది ఉంటుందని వెల్లడించారు. ఈ విషయాన్ని అనిత భర్త సాయిబాబు, అత్త మంగమ్మకు వైద్యసిబ్బంది తెలియజేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని ఆరోపిస్తూ ఆస్పత్రి గేటు ఎదుట బైఠాయించారు. అనితకు నొప్పులు వస్తున్నాయని చెప్పినా నర్సులు పట్టించుకోలేదని, సరైన సమయంలో కాన్పు చేయకపోవడం వల్లే పాప చనిపోయిందని వాపోయారు. గతంలో అనితను పరీక్షించిన వైద్యులు కడుపులో పిండం బాగానే ఉందని చెప్పినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ బాలవెంకటరమణ ఆస్పత్రికి చేరుకుని పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే దర్యాప్తు జరుపుతామని తెలిపారు. అయితే బాధిత కుటుంబీకులు ఎలాంటి ఫిర్యాదు చేయకుండానే పాపను తీసుకువెళ్లి ఖననం చేశారు.

వైద్యశాఖ విచారణ..

వైద్యులు లేకుండా నర్సులే కాన్పు చేయడం, శిశువు మరణించిన అంశాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు స్థానికులు వాట్సాప్ ద్వారా సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఆయన ఈ ఘటనపై విచారణ జరిపించి, నివేదిక పంపాలని మంత్రి పేషీ నుంచి జిల్లా వైద్యశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ విచారణ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

వాచ్‌టవర్ వద్ద చిరుత సంచారం


వాచ్‌టవర్ వద్ద చిరుతపులి

మహబూబ్‌నగర్ క్రైం: ఇటీవల ప్రారంభించిన జంగిల్ ఫారెస్ట్‌లోని వాచ్ టవర్ వద్ద చిరుత పులి కన్పించింది. మయూరీ పార్క్‌కు దాదాపు 6కిలోమీటర్ల దూరంలో ఉన్న వాచ్ టవర్ వద్ద అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ ట్రాప్ కెమెరాలో చిరుత పులి కదలికలు రికార్డు అయ్యాయి. దీనిపై జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. వాచ్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలో శనివారం సాయంత్రం చిరుతపులి(అడల్ట్) కదలికలు రికార్డు అయ్యాయన్నారు. మహబూబ్‌నగర్, అప్పన్నపల్లి అటవీ పరిధిలో దాదాపు 10 చిరుతలు ఉన్నాయని వెల్లడించారు. ఇటీవల వాటికోసం తాగునీరు ఏర్పాటు చేయడంతో మయూరీ పార్క్ అడవిలోకి వస్తున్నాయని తెలిపారు.



దశాబ్ది వేళ.. అద్భుత కళ


శేఖరాచారి

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు కావొస్తున్న సందర్భంగా పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు శేఖరాచారి దశాబ్ది సంబరాన్ని ఆవిష్కరించారు. అతి తక్కువ రాగి, వెండిని ఉపయోగించి రైతువేదిక, బోనం, బతుకమ్మ, ఆవులు, ఎద్దులు, హరితహారం, కాకతీయ తోరణాన్ని రూపొందించి ఆకట్టుకున్నారు. సూక్ష్మకళకు పెట్టింది పేరైన శేఖరాచారి సందర్భానుసారంగా ప్రతిసారి తన కళను ప్రదర్శిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. – కల్వకుర్తి రూరల్

‘చిన్నోనిపల్లి’ పనులు అడ్డుకున్న నిర్వాసితులు


రిజర్వాయర్ దగ్గర పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

గట్టు: మండలంలోనిచిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను నిర్వాసిత రైతులు శనివారం మరోమారు అడ్డుకున్నారు. పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కల్పించకుండా, పునరావాస కేంద్రంలోకి మారేందుకు ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వకుండానే ముంపు గ్రామస్తులకు అధికారులు, ప్రజాప్రతినిధులు మాయమాటలు చెబుతూ రిజర్వాయర్ కట్ట గ్యాప్ పనులను పూర్తి చేస్తుండటంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ కట్ట పనులు జరిగే చోటుకు గ్రామస్తులంతా మూకుమ్మడిగా తరలివెళ్లి పనులను అడ్డుకున్నారు. పునరావాస సమస్యలను పరిష్కరించాలని కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఆరోపించారు. మరోవైపు రిజర్వాయర్ కట్ట గ్యాప్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగులు చిన్నపాటి వర్షానికి పైప్రాంతం నుంచి పెద్దఎత్తున వర్షపు నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతాయని, ఇలా చేరిన నీరు ఇళ్లలోకి చేరితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గ్రామాన్ని ఖాళీ చేయడానికి కనీసం 7 నెలల సమయం కావాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. చాలామంది ప్లాట్లు రాలేదని, 18 ఏళ్లుగా ఉపాధి పనులకు దూరంగా ఉండాల్సి వచ్చిందని, ప్రతిఒక్కరి 1,800 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

శంషాబాద్‌కు చేరిన మహేష్ మృతదేహం


మహేష్ (ఫైల్)

భూత్పూర్: అమెరికాలో గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని కప్పేటకు చెందిన బోయ మహేష్ మృతదేహం అమెరికా నుంచి కార్గో ఫ్లైట్‌లో శనివారం రాత్రి 7 గంటలకు శంషాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరింది. మహేష్ మృతదేహం వస్తుందని సమాచారం తెలియడంతో బంధువులు ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు వారి విచారణ పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రి ఒంటిగంట వరకు ఇంటికి తరలించే అవకాశం ఉందని బంధువులు తెలిపారు.

‘రైలు ప్రమాదానికి కేంద్రం బాధ్యత వహించాలి’

పాలమూరు: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర రైల్వే శాఖమంత్రి వెంటనే రాజీనామా చేయాలని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి నష్టపరిహారంతో ఉద్యోగ భద్రత కలిగిన ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని, ఆయా రంగాల్లో రెగ్యులర్ ఉద్యోగులను తగ్గిస్తూ కాంట్రాక్ట్ కార్మికులను పెంచుతోందని ఆరోపించారు. పాత ట్రాక్‌ల మీదనే వేగంగా నడిచే వందే భారత్ రైళ్లను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్ల ప్రయాణికుల ప్రాణాలు పోతున్నాయని వాపోయారు. మహబూబ్‌నగర్‌లోని అప్పన్నపల్లి దగ్గర జరిగిన రైలు ప్రమాద సమయంలో అప్పటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి పదవికి రాజీనామా చేశారని, ఇప్పుడు అంత కన్నా.. నాలుగు రెట్లు పెద్ద ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

దోచుకోవడంలో కేసీఆర్ ముందు..

- సీఎం కుర్చీ అమరవీరుల త్యాగాల ఫలితమే
- కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: అమరవీరుల త్యాగాలతో సాధించిన తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబమే భోగాలు అనుభవిస్తోందని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సకల జనులు పోరాడితే రాష్ట్రం ఏర్పడిందని, సీఎం కేసీఆర్ మాత్రం తానొక్కడినే సాధించానని ప్రగల్భాలు పలుకుతున్నాడని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లయినా ప్రాణత్యాగం చేసిన అమరవీరులను గుర్తించలేని అసమర్థ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఆనాడు ఉద్యమం, ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో దోచుకోవడంలోనే సీఎం కేసీఆర్ ముందున్నారని ఆరోపించారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం 40 శాతం అవినీతికి పాల్పడితే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అంతకుమించిన దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. ఒక్క ఏదుల రిజర్వాయర్ వద్దనున్న పంప్‌హౌస్‌లోనే తొమ్మిది పంపుల కోసం బీహెచ్‌ఈఎల్ నుంచి రూ.803 కోట్లకు కొనుగోలు చేస్తే సంబంధిత కాంట్రాక్టు సంస్థకు మాత్రం రూ.2,436 కోట్లు చెల్లించాలని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఒక్క టెండర్ అయినా కాంపిటీషన్‌లో ఇచ్చినట్టు చూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ప్రభుత్వం కౌలు రైతులను పూర్తిగా విస్మరించిందని, జిల్లాలోని గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన కౌలు రైతు నర్సింహా పండించిన పత్తి దిగుబడి రాక, అప్పులు తీర్చలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఎలాంటి డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ కాల్వలను నిర్మించకుండానే ప్యాకేజీ 29 కింద ఇప్పటివరకు రూ. 85 కోట్ల బిల్లులు చెల్లించారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేపట్టిన కాల్వలు ఎక్కడున్నాయో చూపాలని ప్రశ్నించారు. ఎలాంటి పనులు ప్రారంభించకుండానే ఈ బిల్లులన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లాయో సమాధానం చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, స్థానిక ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలాగౌడ్, లక్ష్మయ్య, పాండు, నిజాం పాల్గొన్నారు.

కార్మికురాలి కుటుంబానికి పరిహారం చెల్లించాలి



పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో జాతీయ జెండాను తొలగిస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన కార్మికురాలు రేణుక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని శనివారం అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రేణుకకు ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు చెల్లించాలని తీవ్రగాయాలపాలైన బొల్లె చిట్టెమ్మ, బిజినేపల్లి చిట్టెమ్మలకు మెరుగైన వైద్య అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బీఎల్‌పీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనకారులకు పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ రాము నచ్చజెప్పడంతో శవాన్ని దేవల్‌తిరుమలాపూర్ గ్రామానికి తీసుకువెళ్లి అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో నాయకులు దశరథం, బాలస్వామి, చంద్రయ్య, శంకర్, రవి, మద్దిలేటి, రాజేందర్, శ్రీనివాసులు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి, ట్రాలీ దగ్ధం

చారకొండ: పశుగ్రాసం తరలిస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి గడ్డితో పాటు ట్రాలీ దగ్ధమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన చెందిన వరికుప్పల ఎల్లయ్య పశువులకు మేత కోసం గడ్డిని కొనుగోలు కొమ్ము మల్లేశ్‌కు చెందిన ట్రాక్టర్‌లో తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని చర్చి దగ్గర విద్యుత్ తీగలు తగలడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ ఇంజిన్‌ను తప్పించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చేలోపు ట్రాక్టర్ ట్రాలీ, గడ్డి పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో గడ్డికి సంబంధించి రూ.20 వేలు, ట్రాక్టర్ ట్రాలీకి రూ.1.50 లక్షల మేర నష్టపోయామని బాధితులు పేర్కొన్నారు. అయితే మల్లేశ్‌కు ఈ ట్రాక్టర్ దళితబంధు పథకంలో మంజూరైంది.

జంగంరెడ్డిపల్లిలో గడ్డివాములు ..

గండేడ్: ప్రమాదవశాత్తు పొలంలో ఉన్న గడ్డికి నిప్పంటుకుని గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన కొందరు రైతులు వరిపంటను కోసుకుని గడ్డిని పొలంలోనే వదిలేశారు. మరికొందరు రైతులు గడ్డిని తీసుకునేందుకు కుప్పలుగా పెట్టారు. శనివారం ప్రమాదవశాత్తు రోడ్డుకు దగ్గర పొలంలో ఉన్న గడ్డికి నిప్పంటుకుంది. అది వ్యాపిస్తూ జంగంరెడ్డిపల్లి శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన రెండు గడ్డివాములు అంటుకోగా, చిన్నయ్యగౌడ్‌కు చెందిన గేదెకు గాయాలయ్యాయి. మంటలు అధికమై గడ్డివాములు పూర్తిగా బూడిదయ్యాయి.


గతాన్ని మరిస్తే ప్రజలే గుర్తు చేస్తరు..

- రాష్ట్రం కోసం పోరాడిన వారి పేరు ఎత్తకుండా సీఎం అవమానించారు
- నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హన్మంతరావు



సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రం కోసం పోరాడిన వారి పేరు ఎత్తకుండా సీఎం కేసీఆర్ అవమానపర్చారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ.హన్మంతరావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటి నుంచి రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ వంటి వారిని సీఎం కేసీఆర్ విస్మరించారని చెప్పారు. తెలంగాణ ప్రజలు తిన్న తిండిని ఏనాడూ మర్చిపోరని, సీఎం కేసీఆర్ మాత్రం రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ పేరు కూడా ఎత్తడం లేదని అన్నారు. తెలంగాణ బిల్లుకు ఆమోదం తెలిపిన మీరాకుమార్ రాష్ట్రానికి వస్తే కనీస గౌరవం, భద్రతను కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ‘మీరు గతాన్ని మర్చిపోతే ప్రజలే గుర్తుచేస్తారు’ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చిన అతిథులను గౌరవించకపోవడం ఏంటని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా ఎంతో వెనకబడి ఉందని, ఇప్పటికీ యువకులు ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలకు వలస వెళ్తున్నారని చెప్పారు. బలగం సినిమా తర్వాత కుటుంబాలు కలిసినట్లుగానే కాంగ్రెస్ నాయకులు సైతం ఒక్కటయ్యారని అన్నారు. ఇంకా ఎవరైనా నాయకులు మారకపోతే కార్యకర్తలే వారిని మారుస్తారని వ్యాఖ్యానించారు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు


మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి

బిజినేపల్లి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీరు రావడంతో వ్యవసాయం మరింత అభివృద్ధి సాధించిందని, అందులో భాగంగానే పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నూతనంగా 2015లో వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పడినట్లు పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఆడిటోరియంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం వ్యవసాయంలో అనేక పరిశోధనలు జరిగాయని, అందులో భాగంగా రైతులు చిరుధాన్యాల సాగు పెంచేలా కృషి చేశామన్నారు. తద్వారా తెలంగాణలో చిరుధాన్యాల సాగు పెద్దఎత్తున జరుగుతుందన్నారు. అంతేకాక వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జ్ డీన్ సుశీల, కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన



పీయూలో మానవహారం నిర్వహిస్తున్న పీయూ సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలని శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీయూ ముఖద్వారం వద్ద మానవహారం చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. నాటి తెలంగాణ ఉద్యమంలో పీయూ సిబ్బంది ఎంతో కీలకంగా వ్యవహరించారని, సుమారు 25ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం యూనివర్సిటీలో పని చేస్తున్న వారిని చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పుటా అధ్యక్షుడు భూమయ్య, అర్జున్‌కుమార్, పర్వతాలు, శ్రీధర్, స్వాతి, సుధ, సుజాత, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.